ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 09.10.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్ ను ప్రపంచవ్యాప్త పెట్టుబడులకు, సాంకేతిక ఆవిష్కరణలకు చిరునామాగా మార్చేలా గ్లోబల్ కాన్ఫిడెన్స్ కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు
2. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని గ్రామీణ జనాభాలో 25 శాతాన్ని తపాలా ఆర్థిక సేవల పరిధిలోకి తేచ్చి 10 శాతం సేవింగ్స్ లావాదేవీలను డిజిటలైజ్ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డి.ఎస్.వి.ఆర్. మూర్తి తెలిపారు.
3. హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి NFCL జంక్షన్ వరకు ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారంగా 4.3 కిలోమీటర్ల సమగ్ర స్టీల్ ఫ్లైఓవర్ నిర్మిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
4. రాష్ట్రంలో 33 జిల్లాలను ఏర్పాటు చేసి వాటిని అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావుకే దక్కుతుందని బీఆర్ఎస్ నేత హరీష్ రావు అన్నారు.

----------------------------

శ్రీధర్ బాబు

హైదరాబాద్ నగరాన్ని ప్రపంచవ్యాప్త పెట్టుబడులకు. సాంకేతిక ఆవిష్కరణలకు చిరునామాగా మార్చేలా గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్' గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రపంచస్థాయి సంస్థలు

తెలంగాణ నుంచి తమ కార్యకలాపాలను విస్తరించి, ఆవిష్కరణలు చేపట్టేందుకు అవసరమైన మౌలిక వసతులు, ప్రతిభావంతమైన మానవ వనరులు, బలమైన సాంకేతిక ఈకోసిస్టమ్ ఇక్కడ సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గ్లోబల్ డిజిటల్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫామ్ బ్యాక్ బేస్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని ఈ రోజు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటీ పరిశ్రమ విస్తరణకు, కొత్త ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతుగా నిలుస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

(డెస్క్)

--------------------------------

**తెలంగాణ తపాలా**

ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా ఈ రోజు నుంచి ఈ నెల 15వ తేదీ వరకు జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్- CPMG డి.ఎస్.వి.ఆర్. మూర్తి తెలిపారు. హైదరాబాద్‌లోని దాక్ సదన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది “ఒకే తపాలా నెట్‌వర్క్, అనంత అవకాశాలు” అనే ఇతివృత్తంతో కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఇండియా పోస్ట్ ఆధునిక పౌర కేంద్రీకృత సేవా సంస్థగా మారుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక కోటి 7 లక్షల తపాలా సేవింగ్స్ ఖాతాలు ఉన్నాయన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి గ్రామీణ జనాభాలో 25 శాతాన్ని తపాలా ఆర్థిక సేవల పరిధిలోకి తేవడంతో పాటు, కనీసం 10 శాతం సేవింగ్స్ లావాదేవీలను డిజిటలైజ్ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

(MSM )

------------------------------

కేబీఆర్ పార్క్ - మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ కేబీఆర్ పార్క్ పరిసరాల్లోని వన్-వే ట్రాఫిక్ విధానాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలాతో కలసి జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి పొన్నం

ప్రభాకర్ పరిశీలించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుండి NFCL జంక్షన్ వరకు ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారంగా ఒక వెయ్యి 90 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 4.3 కిలోమీటర్ల పొడవైన 6 లేన్ల సమగ్ర స్టీల్ ఫ్లైఓవర్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ను ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్ స్ట్రక్షన్ -EPC విధానంలో రెండు ప్యాకేజీలుగా విభజించి పట్టనున్నట్లు వివరించారు. గతంలో ప్రతిపాదించిన విడివిడి అండర్‌పాస్‌ల స్థానంలో ఈ సమగ్ర కారిడార్ తేవడం ద్వారా ప్రైవేటు భూసేకరణతో పాటు నిర్మాణ వ్యయంలో మొత్తంగా 12 వందల కోట్ల రూపాయల వరకు ఆదా కానుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

**(డెస్క్)**

-------------------------

సీసీఎంబీ

పర్యావరణ పరిరక్షణ, పునరుద్ధరణలో స్థానిక ప్రజల భాగస్వామ్యమే అత్యంత కీలకమని ప్రముఖ పర్యావరణవేత్త ఏకలభ్య శర్మ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ- CCMBలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా "EcoRes2026" పేరిట ఒక రోజు జాతీయ వర్క్ షాప్ నిర్వహించారు. CSIR-NEERI హైదరాబాద్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏకలభ్య శర్మ హైదరాబాద్‌లో క్షీణిస్తున్న చెరువులను, జలవనరులను పునరుద్ధరిస్తున్న తీరును ప్రత్యేకంగా ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణలో కేవలం కాలుష్య నియంత్రణ మాత్రమే సరిపోదని, హరిత సాంకేతికత దిశగా పరిశ్రమలు అడుగులు వేయాలని CSIR-IICT డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.

**(పీటీసీ, హైదరాబాద్)**

-------------------------

మహేశ్ గౌడ్

ఎస్ఐఆర్ ప్రక్రియపై దేశవ్యాప్తంగా బీజేపీ, దాని మిత్రపక్షాలు మినహా మిగతా అన్ని రాజకీయ పార్టీలు పోరాటం చేస్తుంటే రాష్ట్రంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం తప్పులు చేస్తుంటే బీఆర్ఎస్ కనీసం ఒక నిరసన కార్యక్రమం కూడా చేపట్టకపోవడం శోచనీయమని అన్నారు. తమ అక్రమ ఆస్తుల బండారం బయటపడుతుందనే ఉద్దేశంతోనే ఎస్ఐఆర్‌పై బీఆర్ఎస్ఎస్ నేతలు నోరు మెదపడం లేదని ఎద్దేవా చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా రాష్ట్రంలో సుమారు 90 లక్షల ఓట్లకు గండి కొట్టేలా దురుద్దేశపూర్వకంగా వ్యవహరిస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

**(డెస్క్)**

------------------------

సిరిసిల్ల –తపాల దినోత్సవం

ప్రపంచ తపాల దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా తపాల శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తపాల శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ గజ్జెల వేణు అన్నారు.

**(సౌండ్ బైట్ గజ్జెల వేణు)**

**(పీటీసీ సిరిసిల్ల)**

-------------------------

కరీంనగర్-బస్సులు

బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులను నడుపుతోందని కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు తెలిపారు.

**(సౌండ్ బైట్ రీజినల్ మేనేజర్ బి. రాజు)**

**(పీటీసీ, కరీంనగర్)**

---------------------------

సిద్ధిపేట-హరీశ్ రావు

రాష్ట్రంలో 33 జిల్లాలను ఏర్పాటు చేసి వాటిని అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావుకే దక్కుతుందని బీఆర్ఎస్ నేత, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. సిద్ధిపేటను జిల్లాగా మార్చాలనే దశాబ్దాల కలను ఆయన సాకారం చేశారని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 10కె రన్ పరుగును ఆయన జెండా ఊపి ప్రారంభించి, అనంతరం రంగధాంపల్లి వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.

**(పీటీసీ సిద్దిపేట)**

------------------------------

సిరిసిల్ల-పోషన్ మాసం

ఐదేండ్ల లోపు వయసున్న చిన్నారుల్లో ఎదుగుదల లోపిస్తే సమీప అంగన్వాడి కేంద్రాల వారికి సమాచారం ఇవ్వాలని  రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. వేములవాడలో  9వ పోషణ మాసం ముగింపు కార్యక్రమానికి ప్రభుత్వ విప్  స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తో కలిసి కలెక్టర్ హాజరై  సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు నిర్వహించారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

-------------------------

జనగామ-కలెక్టర్

జనగామ జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారం, మానసిక శ్రేయస్సుపై అవగాహన కల్పించేందుకు పాఠశాల ఆరోగ్య, శ్రేయస్సు కార్యక్రమాన్ని సమర్థవంతంగా

అమలు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు సూచించారు. ఈరోజు కలెక్టరేట్ లో ఈ కార్యక్రమ అమలు తీరుపై సమీక్ష చేశారు.

**(పీటీసీ, జనగామ)**

-------------------------------

నల్లగొండ-ఆర్టీఐ

సమాచార హక్కు చట్టం సెక్షన్ 4(1)బి కింద సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించడంలో ఉత్తమ పనితీరు కనబరిచి, నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి 'ఉత్తమ కలెక్టర్' అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, ఉద్యోగులు, ఆర్‌టీఐ అసోసియేషన్ల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

**(పీటీసీ నల్లగొండ)**

------------------------------